

గిరిజనులకు నష్టం జరగకుండా చర్యలు

ప్రజాశక్తి-పాడేరు: మాడగడ, వనజాంగి ఎకో టూరిజం భూముల సర్వేపై సమీక్ష, పాత రికార్డులు పరిశీలించి, పక్కా ప్రణాళికతో రీసర్వే చేయాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్ దినేష్ కుమార్ సంబంధిత అధికారులకు ఆదేశించారుఎకో టూరిజం ప్రాజెక్టుల వల్ల మాడగడ, వనజాంగి గ్రామస్తులు నష్ట పోకుండా తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు. మంగళవారం కలెక్టర్ తన ఛాంబర్ నుండి సంబంధిత శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఈ అంశంపై సమీక్షించారు. ఎకో టూరిజం కోసం మంజూరైన భూముల సర్వే గతంలో ఏ విధంగా జరిగిందనే దానిపై కలెక్టర్ ఆరా తీశారు. "పాత డేటా తీసి తనిఖీ చేయండి. భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు రాకుండా సర్వే చేయాలి" అని అధికారులను ఆదేశించారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించడానికి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, మండల రెవెన్యూ అధికారి (ఎం.ఆర్.ఓ.), మండల సర్వే అధికారి సమన్వయంతో కలిసి పక్కా ప్రణాళికతో రీసర్వే ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పిఒ శ్రీ పూజ, డివిజనల్ ఫారెస్ట్ అధికారి సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.



నిలిచిన రోడ్డు పనులు



రాళ్లు తేలిన రహదారి

నత్తనడకన రోడ్డు పనులు

▶▶ కంకర వేసి వదిలేసిన వైనం ▶▶ ప్రమాదాలకు గురవుతున్న ప్రయాణికులు ▶▶ పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ప్రజల సౌలభ్యం కోసం ఏర్పాటు చేస్తున్న రోడ్డు పనులు నత్తనడకలా సాగుతున్నాయి.దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అరకులోయ మండలం మాడగడ పరిధిలోని బోసుబెడ్డ మాడగడ మేఘాల కొండపై సన్ రైజ్ పాయింట్ సుమారు 3 కిలోమీటర్లు వరకు రోడ్డు మంజూరైంది. రోడ్డు పనులు ప్రారంభించి ఏడాది దాటినా పూర్తి కాలేదు. ఇప్పటి వరకు కంకర పోసి పనులు మాత్రమే కొనసాగుతున్నాయి. అదే విధంగా కంకర పోసిన తర్వాత పూర్తి స్థాయిలో రోడ్డు రోలర్‌తో చదును చేయలేదు. దీంతో, కంకర తేలిన రోడ్డుపై వెళ్తున్న ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలు వెళ్లినప్పుడు వాటి రాపిడికి రాళ్లు ఎగిరి వచ్చి ప్రయాణికులకు తగులుతుండటంతో ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డుపై బస్కి, మాడగడ సుంకరమెట్ట, అనంతగిరి మండలం సౌనభ పంచాయితీ, హుకుంపేట మండలం భూర్జ, పట్టం, వేగండ పంచాయతీ గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.

ఈ క్రమంలో వాహన రాకపోకల కారణంగా కంకరంతా రోడ్డు మధ్యలోకి చేరి ద్విచక్ర వాహనదారులు వెళ్తున్న క్రమంలో ఎక్కువ ప్రమాదాలకు గురవుతున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాడగడ బల్లి పండగకు పర్యటన ఉంది అంటే పనులు ఆగమేఘాలుగా పనులు ప్రారంభించారు. పర్యటన రద్దు కావడంతో మళ్ళీ రోడ్డు పనులు నత్తనడక సాగుతుంది. తక్షణమే రోడ్డు పనులు వేగవంతం చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు.

విద్యార్థి గొంతు కోసిన అగంతకుడు

ప్రజాశక్తి-అరకులోయరూరల్: అల్లూరి జిల్లా అరకులోయ మండలంలోని సోమవారం పట్టపగలే విద్యార్థి గొంతు పై బ్లేడ్ తో కోసి పరారైన అగంతకుడు ఘటన సంచలనం రేపింది. అరకులోయ స్పోర్ట్స్ స్కూల్లో విద్యార్థి పాంగి సుశాంత్ తొమ్మిదవ తరగతి చదువుకుంటున్నాడు. సోమవారం 3.30 గంటల సమయంలో అరకులోయ మండలం కేంద్రంలో బట్టలు కొనుక్కొని పాఠశాలకు తిరిగి వెళ్తున్నాడు. కంటబౌన్సుగూడ గర్ల్స్ స్కూల్ సమీపంలో వెళ్తున్న విద్యార్థిని ఆపి డబ్బులు డిమాండ్ చేశారని,వంద రూపాయల ఇచ్చినా బ్లేడుతో కోసి పరారైనట్లు తోటి స్నేహితులు తెలిపారు.విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండడంతో వెంటనే తోటి స్నేహితుల సాయంతో అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆగంతకుడు మద్యం సేవించి ఉన్నాడని తెలిపారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.దీపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయపడిన విద్యార్థి

స్పోర్ట్స్ స్కూల్ యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలి
- ఆదివాసీ గిరిజన సంఘం నేతల డిమాండ్

అరకులోయ రూరల్: అగంతకుడు చేతిలో గాయాలపాలై అరకులోయ ఏరియా హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న విద్యార్థికి మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం బందం పరామర్శించారు. అనంతరం ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మద్యం,గంజాయి మత్తులో ఉన్న అగంతకుడు విద్యార్థి పై విచక్షణ రహితంగా చేతిలో ఉన్న బ్లేడు తో గొంతు పై కోయడంతో తీవ్ర గాయాలయన్నారు. సుశాంత్ ను స్నేహితులు కాపాడే ప్రయత్నంలో వాళ్ళలో ఒకరికి చేతిలో బ్లేడుతో కోసి గాయపర్చినట్లు తెలిపారు. సుశాంత్ పై అగాయిత్యాలు చేసిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పి బాలదేవ్, మండల కార్యదర్శి జి బుజ్జి బాబు, సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు, ఐసు బాబు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న నాయకులు

అటవీ శాఖ అధికారుల తీరుపై గిరిజనుల నిరసన



ఆందోళన చేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ మాడగడ మేఘాల కొండ అటవీ శాఖ సంబంధించిన స్థలం కాదని గిరిజనులు, వార్డు సభ్యులు మంగళవారం ప్లే కార్డులతో నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాడగడ మేఘాలకొండ 84,86 సర్వేనెంబర్లో 28 ఎకరాల 78 సెంట్లు పూర్తిగా గయ్యాలు కొండ పోరంబోకు భూమి అని మాడగడ గ్రామానికి చెందిన కొంతమంది రైతులకు డి పారం పట్టాదారి పాస్ పుస్తకం ప్రభుత్వం మంజూరు చేసి ఉన్నారన్నారు. రైతులు సాగులో ఉన్నప్పటికీ ఈ నాలుగేళ్లలో ఎన్నడు లేని విధంగా వ్యూ పాయింట్ స్థలము రెవిన్యూ స్థలమా, లేక అటవీశాఖ స్థలమా నిర్ధారణలోకి రాకమునుపే ఆ ప్రదేశంలో స్వయం ఉపాధి పొందుతున్న వారి ఎదురు కర్రలతో ఏర్పాటు చేసిన అలంకరణ ప్రాయంగా ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయాలను ముందుగా సమాచారం లేకుండా అటవీ శాఖ అధికారులు సుమారు రూ రెండు లక్షల ఆస్తి నష్టం ధ్వంసం చేయడం అన్యాయమని వాపోతున్నారు. అటవీ శాఖ అధికారుల తీరును స్వయం ఉపాధి పొందుతున్న సభ్యులు పూర్తిగా వ్యతిరేకిస్తూ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయగా జాయింట్ సర్వే నిర్వహించిన అనంతరం నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చినప్పటికీ దౌర్జన్యంగా ధ్వంసం చేయడం సరికాదని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇదేవిధంగా అంజోడా సిల్క్ ఫారం పూర్తిగా రెవెన్యూ స్థలమైనప్పటికీ అటవీశాఖ అధికారులు దౌర్జన్యంగా ఆక్రమించుకొని అరకు పైనరీ పేరుతో సంవత్సరానికి కోట్లాది రూపాయలు పక్కదారి పట్టిస్తున్న పరిస్థితి ఉన్నాయని ప్రజల నుండి తీవ్ర ఆరోపణలు ఉన్నాయన్నారు. తమకు ఎకో టూరిజం వద్దని, గ్రామ పంచాయతీ ద్వారా మేఘాలకొండ సన్రైజ్ పాయింట్ కొనసాగించి, వచ్చే ఆదాయంతో పంచాయతీ అభివృద్ధి కి ఖర్చు చేయాలని గిరిజనులు కోరుతున్నారని తెలిపారు ఈ కార్యక్రమంలో పెసా ఉపాధ్యక్షులు ఎం బాలరాజు, మాజీ ఎంపీటీసీ అప్పారావు, వార్డు మెంబర్ లక్ష్మణ్ ,స్వయం ఉపాధి పొందుతున్న గిరిజనులు యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

భూ సమస్యలను త్వరగా పరిష్కరించాలి

-జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-పాడేరు: పెండింగ్ భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరెట్ సమావేశ మందిరంలో మంగళవారం రెవిన్యూ శాఖకు సంబంధించిన రీ సర్వే, మ్యుటేషన్లు, ఆర్అండ్ఆర్, ఆర్ఓఆర్, అన్నదాత సుఖీభవ, ప్రజా పిర్యాదుల పరిష్కార వేదిక (స్పందన) వంటి కీలక అంశాలపై సమీక్షా సమావేశం జరిగింది. సబ్ కలెక్టర్లు, మండల రెవిన్యూ అధికారులు (ఎం.ఆర్.ఓలు), సర్వేయర్లు, గ్రామ రెవిన్యూ అధికారులతో (వీ.ఆర్.ఓలు) కలెక్టర్ వర్చువల్‌గా మాట్లాడారు. గ్రామ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత రీ సర్వేలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ మండల రెవెన్యూ అధికారులను ఆదేశించారు.అన్నదాత సుఖీభవ పథకంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తు మ్యుటేషన్లను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ఆధార్ సీడింగ్ పూర్తి కాని వారి వివరాలు సేకరించి, ఆధార్, మ్యుటేషన్ సవరణలు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రీ సర్వేలో తలెత్తే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, మండల స్థాయి సమన్వయ కమిటీ ద్వారా పరిష్కరించే విధంగా చూడాలని సబ్ కలెక్టర్లను ఆదేశించారు.జిల్లాలో భూ సమస్యలను పరిష్కరించి ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలని కలెక్టర్ అధికారులకు హితవు పలికారు. పరిష్కారం కాని భూ తగాదాలు, ఆక్రమణలు, దౌర్జన్యాలను సివిల్ కోర్టుల ద్వారా పరిష్కారమయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు.పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాల గ్రామ ప్రజలకు ప్రభుత్వ పరిహారం అందేంత వరకు చట్టప్రకారం రావాల్సిన సంక్షేమ పథకాలు అందించాలన్నారు..

పౌర సరఫరాల శాఖ సేవలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని, ఎం.ఆర్.ఓలు చౌక ధరల దుకాణాలను విధిగా తనిఖీ చేసి పర్యవేక్షించాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, ఐ.టి.డి.ఏ. పి.ఓ. తిరుమణి శ్రీ పూజ, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నోఖ్వాల్, జిల్లా రెవెన్యూ అధికారి కె.పద్మలత, ఆర్డిఓ ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయంగా నిలుస్తాయని అల్లూరి జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ కొనియాడారు. జిల్లా కేంద్రం పాడేరులోని సిఏహెచ్ స్కూల్ ప్రాంగణంలో మంగళవారం పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా అల్లూరి జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కమార్, అతిథులుగా అల్లూరి జిల్లా ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ శ్రీ పూజ, సహాయకలెక్టర్ సాహిత్ హాజరయ్యారు. సభకు విచ్చేసిన అతిథులకు పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. పోలీసు సిబ్బంది కవాతుకు కమాండర్‌గా ఏఆర్ఆర్ఐ. అరవింద్‌కిషోర్ అమర వీరులకు సంస్మరణ పేరేడ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథులు, పోలీసు అధికారులు అమర వీరుల స్తూపము వద్ద నివాళులర్పించారు. అనంతరం జిల్లా కల్లెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో భాగంగా అనేక మంది అసువులు బాస్తున్నారని పోలీసు అమరవీరుల సంస్మరణ దినంను ప్రతి సంవత్సరం అక్టోబరు 21న జరుపుకొని వారందరి త్యాగాలను స్మరించుకుంటున్నామన్నారు. అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్‌బర్ధర్ మాట్లాడుతూ పోలీసులు తమ ప్రాణాలను తృణ ప్రాయంగా పెట్టి ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణ కొరకు పాటుపడుతున్నారన్నారు. పోలీస్ కుటుంబాలు అందరికీ జిల్లా పోలీస్ శాఖ తరపున సహకారం అందించడానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానన్నారు. ప్రభుత్వపరంగా వారికి రావలసిన రాయితీలు, కారుణ్య నియామకాలపై అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్యలు తెలిపితే సత్వరమే చర్యలు తీసుకుంటామని భరోసాను కల్పించారు. ఏఆర్ అడిషనల్ ఎస్పీ డిఎస్పి ఎస్‌డిపిఎస్ఓ, ఆర్ఐలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



చింతూరు: మానవహారం నిర్వహిస్తున్న పోలీసులు

చింతూరు: పోలీస్ అమరవీరుల దినాన్ని పురస్కరించుకొని మంగళవారం పోలీస్‌స్టేషన్ పరిధిలో విద్యార్థులు పోలీస్ జవాన్లు సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా తరలి వెళ్లి ప్రధాన కూడలి వద్ద మానవహారంగా ఏర్పడి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పలువురు పోలీస్‌అధికారులు మాట్లాడుతూ పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేమని తెలిపారు.



మృతి చెందిన బిఎస్ఎఫ్ జవాన్

కారు ప్రమాదంలో బిఎస్ఎఫ్ జవాన్ మృతి

ప్రజాశక్తి - చింతూరు: మండలంలోని చట్టి జాతీయ రహదారి 30పై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో బిఎస్ఎఫ్ జవాన్ అక్కడికక్కడే మృతి చెందారు. ఎస్సై రమేష్ తెలిపిన వివరాల ప్రకారం బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌కు సంబంధించిన ఏడుగురు జవానులు తెలంగాణ రాష్ట్రం ఖమ్మం నుండి బలిమెల, ఒరిస్సాకు కారులో వెళుతుండగా తెల్లవారుజామున చింతూరు మండలం చట్టి జంక్షన్‌కి దగ్గరలో ఉన్న కల్వర్టును ప్రమాదవశాత్తు ఢీ కొంది. ప్రమాదంలో జవాన్ మృతి చెందగా మిగిలిన వారు గాయాల పాలయ్యారు. వీరికి చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం భద్రాచలం ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై చింతూరు పోలీసు వారు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఐటిడిఎ పిఒకి వినతిపత్రం ఇస్తున్న రవీంద్ర

నోటీసు గడువు ముగిసినా చర్యలేవీ?

ప్రజాశక్తి- చింతూరు: కూనవరం పంచాయతీలో జరిగిన అవినీతిపై అధికారులు చేసిన దర్యాప్తు మేరకు అవినీతి జరిగిందని వాటికి సమాధానం చెప్పాలని కూనవరం మాజీ ఇఒ సురేష్‌కి కూనవరం ప్రమోషన్ సర్పంచ్ మల్లంపల్లి హేమంత్‌కి వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని సంబంధిత శాఖ ఉన్నతాధికారులు నోటీసులు ఇవ్వడం జరిగింది. నోటీసులు గడువు ముగిసినా నేటికీ వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని, అవినీతిని త్వరగా బయటపెట్టి ప్రజాధనాన్ని రికవరీ చేయాలని అవినీతికి పాల్పడ్డ వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని ఐటిడిఎ పిఒకి అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొక్కెరపాటి రవీంద్ర మంగళవారం వినతిపత్రం అందజేశారు.

పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-కొయ్యూరు: మండలంలోని బాలారం పంచాయతీ డి.మల్లవరంలో జరిగిన అగ్నిప్రమాదంలో గడుతూరి నాగరాజుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. ఇంట్లో ఉన్న సామాగ్రితో సహా దుస్తులు, కొంత నగదు, బియ్యం పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో ఇద్దరు చిన్నారులతో సహ కట్టుబట్టలతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం స్పందించి తగు న్యాయం చేయాలని కోరుతున్నారు.



దగ్ధమైన పూరిల్లు



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎఒ రత్నప్రభ

సబ్సిడీపై విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి - చింతూరు: మండలంలోని రైతులకు 90 శాతం సబ్సిడీపై మినుములు, పెసలు విత్తనాలను మంగళవారం వ్యవసాయ అధికారి రత్నప్రభ ఆధ్వర్యంలో టిడిపి మాజీ మండల అధ్యక్షులు జహంగీర్ వ్యవసాయ మార్కెట్ సభ్యుడు సాల్మన్‌రాజు, మస్తాన్ జానీ సమక్షంలో రైతులకు అందజేశారు.



మాట్లాడుతున్న చీఫ్ ఇంజనీర్ రామారావు

పంప్డ ప్రాజెక్టుతో నష్టపోతున్న గిరిజనులను ఆదుకోవాలి

ప్రజాశక్తి -సీలేరు: సీలేరులో నూతనంగా నిర్మించబోయే పంప్డ స్టోరేజ్ ప్రాజెక్టు నిర్మాణం వల్ల నష్టపోతున్న గిరిజనులను ఆదుకోవాలని వారికి పూర్తిస్థాయి పరిహారం అందించాలని గిరిజన సంఘ నాయకులు మార్కరాజు , మనోజ్ కుమార్ జెన్ కో అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం జెన్‌కో అధికారులు సీలేరు జెన్‌కో అతిథిగృహంలో స్థానికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు గిరిజనులకు వంద శాతం ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు వలన ఏ మేరకు నష్టపోతున్నారనే సమాచారం తమకు ఇవ్వాలని కోరారు. ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి, సర్పంచ్ పాంగి దుర్గో , వివిధ పార్టీల నాయకులు పలు డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సీలేరు పిహెచ్‌సిని 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలన్నారు. జెన్ కో అధికారులు మాట్లాడుతూ ప్రజాబి.ప్రాయసేకరణలో వచ్చిన డిమాండ్లు నెరవేర్చడానికి యాజమాన్యం కట్టుబడి ఉందని, దీనిపై ప్రజల్లో ఎటువంటి అపోహలు వద్దని, యాజమాన్యం పలు డిమాండ్లు పరిష్కార దిశగా చర్యలు చేపడుతోందని చీఫ్ ఇంజనీర్ రాజారావు హామీ ఇచ్చారు. విజయవాడ విద్యుత్ సౌధా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రత్నకుమార్, జెన్కో అధికారులు సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇఇ బాలకృష్ణ. ఎడిఇ అప్పలనాయుడు. జైపాల్ ఎఇఇ సురేష్ ఉన్నారు.

నేడు ఎకో టూరిజంపై సమావేశం

జిల్లా అటవీ శాఖాధికారి సందీప్ రెడ్డి

ప్రజాశక్తి -పాడేరు : వంజంగి, మాడగడ ఎకో-టూరిజంపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో , ప్రజల అభ్యంతరాలు, అపోహలపైన జిల్లా కలెక్టర్ నేతృత్వంలో సమన్వయ సమావేశం ఈనెల 22న నిర్వహిస్తున్నట్లు జిల్లా అటవీ శాఖాధికారి పివి సందీప్‌రెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలోని వంజంగి, మాడగడ గ్రామాల్లో ప్రతిపాదిత ఎకో-టూరిజం ప్రాజెక్టులపై ప్రజల నుంచి అసహనం వ్యక్తమవుతున్న నేపథ్యంలో, రెండు కీలక సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ అధ్యక్షతన, ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ, ఆర్డీవో, ప్రజా ప్రతినిధులు పాల్గొననున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశాలలో ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవడంతో పాటు, వారు ఇంతవరకు అందించిన అభిప్రాయ పత్రాల పైన చర్చించి తగిన పరిష్కారం తో కూడిన సలహాలు, సూచనలను జిల్లా కలెక్టర్ సూచిస్తారని చెప్పారు. కమ్యూనిటీ బేస్డ్ ఎకో-టూరిజం విధానం వల్ల తమ జీవనోపాధికి నష్టం జరుగుతుందని ప్రజలు అపోహ చెందుతున్నారన్నారు. కొన్ని గ్రామాలను మాత్రమే చేర్చడం వలన ఇతర గ్రామ ప్రజలకు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రజల అనుమానాలను, అపోహలను తొలగించిస్థానిక ప్రజలకు కలిగే ప్రయోజనాల పై అవగాహనా కలిగిస్తారని తెలిపారు . జిల్లాలో అవగాహనా కార్యక్రమాలకు సంబంధించి ఇదే తుది సమావేశం అన్నారు.


ప్రచారం చేస్తున్న నాయకులు

జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలోని బాబుసాల పంచాయతి మొండిగుమ్మ గ్రామంలో మంగళవారం టిడిపి మండల అధ్యక్షులు కిల్లో సన్యాసమ్మ ఆధ్వర్యంలో సూపర్ జిఎస్టి సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు సన్యాసమ్మ మాట్లాడుతూ, జీఎస్టీ మినహాయింపు తో కూడిన వస్తువుల కొనుగోలులో దుకాణదారులు మోసం చేస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని అవగాహన పరిచారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరి పాంగి శాస్త్రిబాబు, సీనియర్ నాయకులు నీలకంఠం పాత్రో, మండల కోశాధికారి వంతల జగదీష్, కూడ సుబ్రహ్మణ్యం, గొల్లోరి రమణ, క్లస్టర్ ఇంచార్జి మజ్జి. చిన్ని, బాబుశాల పంచాయతి అధ్యక్షులు ఈశ్వర్ రావు, బాలన్న, నరేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కందుకూరు హత్య ఘటనపై స్పందనకు కృతజ్ఞతలు

ప్రజాశక్తి-సీతమ్మధార : కందుకూరు హత్య ఘటనపై ప్రభుత్వం తక్షణమే స్పందించినందుకు రాధా రంగా రాయల్ అసోసియేషన్ నేత గాదె బాలాజీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అక్కయ్యపాలెం హైవేలో ఉన్న వంగవీటి రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జనసేన నాయకులు ఉషాకిరణ్, రాధా రంగా రాయల్ అసోసియేషన్ ప్రతినిధి బొగ్గు శ్రీను తదితర ప్రతినిధులతో కలిసి గాదె బాలాజీ మాట్లాడారు. కందుకూరు హత్య ఘటనలో బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన భరోసా ఇవ్వడం పట్ల హర్షం వెలిబుచ్చారు. మీడియా సమావేశంలో రాధా రంగా రాయల్ అసోసియేషన్ నేతలు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

వార్డుల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి వార్డుల అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక తయారు చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. ఎంవిపి కాలనీ క్యాంప్ కార్యాలయంలో మధురవాడ, భీమిలి జోనల్ కమిషనర్లతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, కల్యాణ మండపాలు, హౌసింగ్ తదితర సమస్యల పరిష్కారానికి మున్సిపల్ మంత్రి పొంగూరు నారాయణ, కమిషనర్ కేతన్ గార్గ్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్టు గంటా వెల్లడించారు. ఎండాడ మెయిన్ రోడ్డులో ఫుట్ పాత్ వ్యాపారులకు ప్రతిపాదించిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలన్నారు.

ఒడిఎఫ్ జిల్లాగా మార్చాలి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: ఓడీఎఫ్ జిల్లాగా మార్చాలని, అంగన్వాడీలకు శాశ్వత భవనాలు నిర్మించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు. జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా గ్రామ/వార్డు సచివాలయాలు, ఆర్.డబ్ల్యు.ఎస్., ఆరోగ్య శాఖ, గృహ నిర్మాణం, స్త్రీ శిశు సంక్షేమ శాఖల పని తీరుపై జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం వర్చువల్‌గా సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని క్రింది స్థాయి సిబ్బంది ప్రతి ఇంటిని సందర్శించి మరుగుదొడ్లు (ఐ.హెచ్.హెచ్.ఎల్.) ఉన్నాయో లేదో సమాచారం సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్.డబ్ల్యు.ఎస్. ఇంజనీరింగ్ అధికారులు, ఎం.పి.డి.ఓలు, ఈ.వో.పీ.ఆర్.డీలు క్షేత్ర స్థాయిలో పర్యటించి పర్యవేక్షించాలన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా మండల రిసోర్స్ కోఆర్డినేటర్లకు శిక్షణ ఇప్పించి, అధికారుల సమన్వయంతో జిల్లాను బహిరంగ మల విసర్జన రహిత (ఓ.డి.ఎఫ్.) జిల్లాగా మార్చాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాలు, పర్యాటక స్థలాలలో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలలో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారులకు ఆదేశించారు. అద్దె భవనాలలో ఉన్న అంగన్వాడీలకు శాశ్వత భవనాలు నిర్మించాలని స్పష్టం చేశారు. గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా పెండింగ్‌లో ఉన్న సిటిజన్స్ ఈ-కేవైసీ, ఆధార్ సీడింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్లు కార్యాలయ పని వేళల్లో అందుబాటులో ఉండాలని, దివ్యాంగుల ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వారికి పనులు అప్పగించాలని సూచించారు. ఫ్రైడే-డ్రైడేలో భాగంగా జిల్లాను మలేరియా రహిత జిల్లాగా మార్చాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. హైరిస్క్ గర్భిణీలను గుర్తించి మెరుగైన సౌకర్యాలు అందించాలన్నారు. పీఎం జనమన్, పీఎం గ్రామీణ హౌసింగ్ పథకాల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయడానికి ఐ.టి.డి.ఎ. పీవోలు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్, ఐ.టి.డి.ఎ. పి.ఓ. తిరుమణి శ్రీ పూజ, రంపచోడవరం ప్రాజెక్టు అధికారి స్మరన్ రాజ్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభమ్ నోక్వాల్, ఆర్.డబ్ల్యు.ఎస్. ఈఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

22 నుండి ఆసుపత్రి శానిటేషన్ కార్మికుల సమ్మె


ఆసుపత్రి వద్ద ఆందోళన చేపడుతున్న కార్మికులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: సమస్యలు పరిష్కరించాలని ఈనెల 22 నుండి సమ్మెలోకి దిగుతున్నట్లు ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు తెలిపారు. మంగళవారం అరకులోయ ఏరియా ఆసుపత్రి ముందు నిరసన తెలియజేశారు. అనంతరం ఉన్నతాధికారుల ద్వారా కాంట్రాక్టర్‌కు సమ్మె నోటీసు ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ హాస్పటల్ శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి రమ మాట్లాడుతూ, ..2024 సంవత్సరంలో వేతనాలు పెంచుతూ ఇచ్చిన జీవోను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు మాట్లాడారు. పెంచిన వేతన జీఓ ప్రకారం 24 ఏరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్తవారికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికులకు సకాలంలో జీతాలు రావడంలేదన్నారు. ప్రతినెలా ఒకటో తారీఖున వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, డ్యూటీ చార్ట్ ఏర్పాటు చేసి అదనపు పనులు అప్పగించరాదని డిమాండ్ చేశారు. టెండర్ పద్ధతి రద్దుచేసి ప్రభుత్వమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గత కొంతకాలంగా అనేక సందర్భాల్లో ఉన్నతాధికారులకు సమస్యలు పరిష్కరించాలని విన్నవించినా పట్టించుకోలేదని అందుకే సమ్మెలోకి వెళుతున్నట్లు తెలియజేశారు.

బంక్‌లో తనిఖీలు చేసిన జిసిసి డివిజన్ మేనేజర్

ప్రజాశక్తి హుకుంపేట : మండల కేంద్రంలోని హిందుస్థాన్ పెట్రోలియం బంకుల్లో శుక్రవారం రాత్రి డీజిల్ కల్తీపై మోటర్ యూనియన్లు ఆందోళనకు దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో స్పందించిన జిసిసి డివిజన్ మేనేజర్ బుక్క వెంకటేష్ సందర్శించారు.డీజిల్‌లో కల్తీ జరగలేదని బంకు యాజమాన్యం మొదట అంగీకరించక పోవడంతో మోటర్ యూనియన్లు డీజిల్ నమూనాను బాటిల్‌లో చూపిస్తూ మేనేజర్‌తో వాగ్వాదానికి దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో హుకుంపేట సీఐ సన్యాసినాయుడు సమక్షంలో బంకు యాజమాన్యం, మోటర్ యూనియన్ల మధ్య చర్చలు జరిగాయి. ఏడు వాహనాలు ఆగిపోవడంతో వాహనదారులు నష్టపోయారని యూనియన్లు పేర్కొన్నారు. దీనిపై డివిజన్ మేనేజర్ మాట్లాడుతూ, ప్రస్తుతం ట్యాంకర్‌లో ఉన్న 16,000 లీటర్ల ఆయిల్‌ను పూర్తిగా ఖాళీ చేసి, 2,000 లీటర్ల వరకు మాత్రమే నిల్వ ఉంచి కొత్తగా ఆయిల్ ట్యాంకర్లు తెప్పించి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కల్తీ జరిగి ఉంటే వాహనాలను రిపేరు చేయించి, ఆయిల్‌ను కొట్టించి నష్టపరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీనితో మోటర్ యూనియన్లు తాత్కాలికంగా ఆందోళన విరమించాయి. రిపేరు ఖర్చు, ఆయిల్ నష్టపరిహారం త్వరగా చెల్లించకపోతే మళ్లీ ఆందోళనకు దిగుతామని మోటార్ యూనియన్లు పైడి రాజు, నాగేశ్వరరావు, కామేష్, హెచ్చరించారు.


పెట్రోల్‌ను చూపుతున్న డ్రైవర్లు

నేరాలు ఘోరాలు


ఘాట్ రోడ్డులో విరిగిపడిన రాళ్లు

ఘాట్ రోడ్డులో విరిగి పడిన కొండ చరియలు

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అనంతగిరి ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగి పడుతున్నాయి. మండలంలోని గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా కుండపోత వాన కురుస్తుంది. ఘాట్ రోడ్డు శివలింగపురం ఒకటో నెంబర్ కు సమీపము బొర్రా జంక్షన్ ఆరో నెంబర్, బొర్రా గుహలకు వెళ్ల రైల్వే గేటు సమీపము మలుపు వద్ద సోమ, మంగళవారం కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో స్థానికులతో పాటు ప్రముఖ పర్యాటక కేంద్రాలను తిలకించేందుకు వచ్చే విదేశీ ఇతర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు ఇబ్బంది పడ్డారు.

ఆటో ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి- కోటవురట్ల : ఆటో ఢీకొన్న ఘటనలో కోటవురట్ల గ్రామానికి చెందిన టిల్లాపుడి భాస్కరరావు (57) మృతి చెందాడు. వివరాలివి. గ్రామంలో స్వీట్ స్టాల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న భాస్కరరావు ఎప్పటిలాగే సోమవారం రాత్రి 9 గంటలకు షాపు మూసి సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా వెనక నుంచి ఆటో బలంగా ఢీకొట్టింది. తీవ్రగాయాలైన భాస్కరరావును స్థానిక సిహెచ్‌సిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యానికి విశాఖ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు


సమావేశంలో పాల్గొన్న ఆదివాసీ క్రైస్తవ సేవకులు

ఆదివాసీ క్రైస్తవ సేవకుల ఐక్యవేదిక సమావేశం

ప్రజాశక్తి- చింతపల్లి: సమాజంలో సత్వర మార్పు రావాలంటే క్రైస్తవులు ఒకే వేదికపైకి రావడం, పరస్పర సహకారంతో ముందుకు సాగడం అత్యవసరమని జాతీయ ఆదివాసీ క్రైస్తవ సేవకుల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షులు కె. నిరీక్షణరావు, జాతీయ కార్యదర్శి ఎం. ఎలిషా, రాష్ట్ర కార్యదర్శి ఎం. కృపానిధి, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి దైవప్రసాద్ అన్నారు మంగళవారం పట్టణంలోని ఆదివాసీ శిక్షణ కేంద్రంలో సంఘ కాపరులు వి. సోమరాజు, పి. డేవిడ్, కాలేబు, తిమోతి ఆధ్వర్యంలో ఐక్యవేదిక సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో క్రైస్తవులు, ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్న సేవకులు అనేక కష్టాలు, అణచివేతలు ఎదుర్కొంటున్నారని, ఈ పరిస్థితుల్లో ఐక్యతతో ముందుకు సాగడం అత్యవసరమన్నారు. ఐక్యత ద్వారానే క్రైస్తవ సంఘం బలోపేతం సాధ్యమన్నారు. సమావేశంలో పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు ఐదుమండలాల సేవకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జోసెఫ్, శామ్యూల్, టి. రవి వినోద్ భూషణం, జాన్ పాల్ యేసురాజు తిమోతి, జోసెఫ్ గాబ్రియేల్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల సాహసం అజరామరం

శౌర్యం, స్మృతి పుస్తకాల ఆవిష్కరణలో సిపి డాక్టర్ శంఖబ్రతబాగ్చి

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ: అమరులైన పోలీసుల ధైర్య సాహసాలు, త్యాగాలు, వారి పరాక్రమ సౌర్యం అనితర సాధ్యమైనవని బాగ్చి అన్నారు. 'పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం' సందర్భంగా 'రియల్ హీరోస్‌కి మా వందనం' పేరిట శౌర్యం, స్మతి తెలుగు, ఆంగ్ల బుక్‌లెట్స్‌ను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంకబ్రతబాగ్చి వారి కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మసంరక్షణార్థం తమ ప్రాణాలను తణప్రాయంగా అర్పించిన అమరులైన పోలీసుల సేవలను స్మరిస్తూ నివాళులర్పించడమే 'పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ' లక్ష్య మని బాగ్చి పేర్కొన్నారు. అనేక స్వచ్ఛంద సామాజిక సేవాచైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తూ యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తున్న వాకర్స్ ఇంటర్నేషనల్ యూత్ చైర్ పర్సన్ వంశీ చింతలపాటి, యూత్ వాకర్స్ బృందం చేస్తున్న కషిని పోలీస్ కమీషనర్ బాగ్చి కొనియాడారు. యూత్ సమన్వయకర్త లికిత్‌బేత మాట్లాడుతూ ఈ బుక్ లెట్స్‌ను ద్రోణ కన్సల్టీ అధినేత సురేష్ బేత రచించారన్నారు. కార్యక్రమంలో యూత్ వాకర్స్ కార్యదర్శి పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.


పుస్తకావిష్కరణలో సిపి

24న ఎవిఎన్ కళాశాలలో తరగతి గదులు ప్రారంభం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్ : నగరంలో ఎవిఎన్ కళాశాలలో తరగతి గదుల ఆధునీకరణ పనులు సుమారు కోటి రూపాయల వ్యయంతో పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో పూర్తయ్యాయని, ఈ నెల 24వ తేదీన ప్రారంభించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్, వైస్‌చైర్మన్ ఎ.వి.అదీప్‌భానోజీరావు తెలిపారు. మంగళవారం కళాశాల సమావేశ మందిరంలో పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షులు అజ్జరపు సర్వేశ్వరరావు, ఎన్.వి.ఎన్‌రామసాయి సారథ్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అజ్జరపు సర్వేశ్వర రావు, ఎన్.వి.ఎన్ రామసాయిబృందం ఎంతో కృషి చేశారని కొనియాడారు. కళాశాలలో మొదటి అంతస్తులో తరగతి గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో ఆధునీకరణ పనులు చేపట్టామని, కొత్త తరగతి గదులు, బోర్డు రూమ్, బోటనీ ల్యాబ్, విద్యార్థినుల విశ్రాంతి గదులు పూర్తి చేసినట్టు తెలిపారు. కళాశాలలో 1976-77 విద్యా సంవత్సరంలో బిఎస్‌సి మొదటి సంవత్సరం చదివిన పూర్వ విద్యార్థి సిహెచ్ వెంకట సుబ్బారావు రూ.70 లక్షలు విరాళంగా అందజేశారని ఆయన చెన్నై కేంద్రంగా సన్మార్ షిప్పింగ్ లిమిటెడ్ నిర్వహిస్తున్నారని కళాశాల కోసం పెద్ద మొత్తంలో విరాళం ఇచ్చారని తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థి, ఎయు ఉప కులపతి ఆచార్య జి.రాజశేఖర్ వారి మిత్రులు రూ.10 లక్షల 50 వేలు విరాళంగా అందజేశారని చెప్పారు. పూర్వ విద్యార్థుల సంఘం మాజీ అధ్యక్షులు, పూర్వ న్యాయమూర్తి మాకిన శ్రీనివాసరావు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.కృష్ణకుమారి, ఎం.స్వర్ణలక్ష్మి, కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు అజ్జరపు సర్వేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు వాసిరెడ్డి శ్రీనివాసరావు వారి మిత్రులు రూ.3 లక్షల చొప్పున, సంఘం ప్రతినిధి పి. నారాయణస్వామి, సి.వి.ఎస్.నాయుడు లక్ష రూపాయల చొప్పున విరాళాలు అందించారన్నారు. కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ ఎం.సింహాద్రినాయుడు పర్యవేక్షణలో పూర్తయిందని తెలిపారు. సి.వెంకటసుబ్బారావు, ఆంధ్ర విశ్వ కళాపరిషత్ ఉప కులపతి ఆచార్య జి.రాజశేఖర్ ఈనెల 24 న వీటిని ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం పూర్వ విద్యార్థుల సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో పూర్వ విద్యార్థుల కోశాధికారి భారతి, ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ పి.కృష్ణకుమారి, పూర్వ ప్రిన్సిపాల్ సింహాద్రి నాయుడు పాల్గొన్నారు.

నాలుగో రోజుకు అద్దెబస్సు డ్రైవర్ల సమ్మె

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: అద్దెబస్సు డ్రైవర్ల వేతనాలు పెంచాలని వాల్తేర్ డిపోలో అద్దె డ్రైవర్ల సమ్మె నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వంటావార్పు కార్యక్రమం చేపట్టి ఆర్టీసీ అధికారులు, అద్దె బస్సు యజమానులు గాని చర్చలకు ఆహ్వానించి డిమాండ్స్ పరిష్కరించడంలో ముందుకు రావటం లేదని విమర్శించారు. ఇప్పటికే మద్దిలపాలెం, సింహాచలం డిపోల్లో అద్దె బస్సు డ్రైవర్లు వేతనాలు పెంచాలని ధర్నాలు చేసి వినతిపత్రాలు ఇచ్చారని జిల్లా వ్యాప్తంగా అద్దెబస్సు డ్రైవర్ల జీతాలు పెంచి డిమాండ్స్ ఆమోదించకపోతే అన్ని డిపోల్లో సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఆర్టీసీలో ఆన్‌కాల్ డ్రైవర్‌కి 8 గంటల డ్యూటీకి 1000 జీతం చెల్లిస్తే, అదే డ్రైవర్ డ్యూటీ చేస్తున్న అద్దె బస్సు డ్రైవర్లకు మాత్రం రూ.600 మాత్రమే చెల్లిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అద్దె బస్సు యజమానులు చర్చలకు వచ్చి వేతనాల పెంపుతో పాటు ఇతర డిమాండ్స్‌ను నెరవేర్చాలన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలి

జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షుడు నూకరాజు

ప్రజాశక్తి- విశాఖకలెక్టరేట్: జివిఎంసిలో విలీనం కాబడిన 32 పంచాయతీల కాంట్రాక్ట్ కార్మికులకు మినిమం టైంస్కేల్ అమలు చేయాలని, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) అధ్యక్షుడు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకుటి రాజు డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం జివిఎంసిగాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, హైకోర్టు ఆదేశాల ప్రకారం విలీన పంచాయతీ కాంట్రాక్ట్ కార్మికులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలన్నారు. 2005లో విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ జివిఎంసిగా ఏర్పాటైన సందర్భంలో 32 గ్రామ పంచాయతీలు, గాజువాక మున్సిపాలిటీ కాంట్రాక్ట్ కార్మికులను 2005 నవంబర్ 21న విలీనం చేశారని, 2006 జూలై వరకు నేరుగా జోనల్ కమిషనర్లు వీరికి వేతనాలు చెల్లించేవారన్నారు. దీనిని యాజమాన్యం కోర్టుకు సమర్పించిన కౌంటర్‌లో అంగీకరించిందని ఆధారాలను జివిఎంసి అధికారులే ధ్రువీకరించి 593 మంది కాంట్రాక్టు కార్మికుల జాబితాలను, అధికారులు ఇచ్చిన సర్వీస్ సర్టిఫికెట్లు, ప్రతి సంవత్సరం వీరిని కొనసాగించటానికి అనుమతి కోరుతూ పంపిన లేఖలు, జెసిఎల్ వద్ద జరిగిన ఒప్పందాలు, మినిట్స్ ఈ కార్మికుల పేరుతో ఉన్నాయని తెలిపారు. అందుకు సంబంధించిన డాక్యుమెంట్లను జివిఎంసి కమిషనర్, మేయర్‌లకు అందించామన్నారు. ఇప్పటికైనా కోర్టు ఆదేశాల ప్రకారం వీరికి మినిమం టైం స్కేల్ అమలు చేయాలని, లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ గొలగాని అప్పారావు, జె.ఆర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

జెడ్‌పిటిసి హత్య కారకులను శిక్షించాలి

ఏరియా ఆసుపత్రి వద్ద వైసిపి నేతలు, కుటుంబీకుల ఆందోళన

ప్రజాశక్తి- నర్సీపట్నంటౌన్: రోలుగుంట మండలం ఎంకే.పట్నం శివారు పెదపేట ఆవరణలో కొయ్యూరు జెడ్పీటీసీ వారా నూకరాజును హత్య చేయడంపై వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. సోమవారం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తీసుకు రావడంతో మండల ప్రజలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకున్నారు.పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు, మాజీ శాసన సభ్యురాలు భాగ్యలక్ష్మి, ఈ ధర్నాకు నాయకత్వం వహించారు. కోయ్యూరు మండలం నుంచి, అల్లూరి సీతా రామరాజు జిల్లా పరిధిలోని వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో వైఎస్ఆర్ కాం గ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ధర్నాలో పాల్గొన్నారు. రోలుగుంట సిఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు ప్రకారం హత్య కేసు పై విచారణ జరుపుతున్నామని దాడి చేసిన కుటుంబాలపై కేసు నమోదు చేశామని త్వరలోనే నిందితులను అరెస్టు చేస్తామని తెలిపారు.

చర్యలు తీసుకోండి : జెడ్‌పిటిసి నూకరాజు భార్య గంగమ్మ

కొయ్యూరు : తన భర్త హత్యకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని నూకరాజు భార్య గంగమ్మ కోరారు. సొంత ఊర్లో స్థలం అమ్మి కోటి రూపాయలు పెట్టి పొలం కొనుగోలు చేశామని పేర్కొన్నారు. పొలంలోకి వెళ్తే దాడులు చేస్తున్నారని పోలీసులకు చెప్పినప్పటికీ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై తన భర్త అనేకసార్లు బాధపడ్డారని పేర్కొన్నారు. న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సిఐ కనీసం ఫోన్ ఎత్తలేదని ఆరోపించారు. పోలీసులు పట్టించుకుంటే నా భర్తకు ఇలా జరిగేది కాదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

మాజీ ఎంపీ మాధవి సంతాపం

జెడ్‌పిటిసి నూకరాజును హత్య ఉదంతం తెలుసుకున్న అరకు మాజీ ఎంపి గొడ్డేటి మాధవి ఆయన మృతికి సంతాపం తెలియజేస్తూ, కూటమి ప్రభుత్వంలో ఎవరికీ రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి హత్యకు కారణమైన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు.

గర్భాశయ కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: విశాఖ పట్నం ఇంటర్నేషనల్ ఇన్నర్ వీల్ క్లబ్‌కు అనుబంధ శాఖ అయిన ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ వాల్తేరు ఆధ్వర్యంలో సాగర్‌నగర్ అర్బన్ పిహెచ్‌సిలో 11 నుండి 21 సంవత్సరాల వయస్సుగల బాలికల కోసం మంగళవారం ఉచిత గర్భాశయ గర్భద్వార కేన్సర్ అవగాహన టీకా శిబిరాన్ని నిర్వహించారు.


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ గర్భాశయ గర్భద్వార కేన్సర్ దేశంలో మహిళల్లో రెండో అత్యధికంగా కనిపించే వ్యాధిగా ఉందన్నారు. హెచ్‌పివి వ్యాక్సిన్ ద్వారా ఈ వ్యాధిని సమర్థవంతంగా నివారించ వచ్చన్నారు. ఈ టీకాను 15 సంవత్సరాల్లోపు బాలికలకు 2 డోసులు ఇవ్వాలని, 15 సంవత్సరాలు పైబడిన వారికి 3 డోసులు ఇవ్వాలని తెలిపారు. ఈ టీకా, రెగ్యులర్ పాప్‌స్మియర్ పరీక్షలు, వ్యక్తిగత పరిశుభ్రత (హైజీన్) ద్వారా గర్భాశయ కేన్సర్‌ను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ జిల్లా చైర్మన్ అరుణశ్రీ, క్లబ్ అధ్యక్షురాలు ఎం.స్వాతి, క్లబ్ కార్యదర్శి డాక్టర్ లక్ష్మీ ప్రసూన, అశోక కుమారి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

డిసెంబర్ 9 నుంచి విశాఖ బాలోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఈ ఏడాది డిసెంబర్ 9 నుంచి 11 వరకు నగరంలోని సెయింట్ ఆంథోనీ ఓల్డ్ ప్రైమరీ తెలుగు మీడియం స్కూల్‌లో విశాఖ బాలోత్సవం 2025 జరుగనుంది. ఈ మేరకు ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశం మంగళవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో విశాఖ బాలోత్సవం అధ్యక్షులు పిల్లలమర్రి రఘు అధ్యక్షతన జరిగింది. విసిసి నాయకురాలు డాక్టర్ కె.రమాప్రభ బాలోత్సవాల ప్రాధాన్యతను వివరించారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జిఎస్.రాజేశ్వరరావు మాట్లాడుతూ 2023లో మొదటిసారి బాలోత్సవాన్ని నిర్వహించామని, అందులో ఆరు వేల మంది పిల్లలు 84 ఈవెంట్లలో పాల్గొన్నారని, 2024 బాలోత్సవంలో 8 వేల మంది పిల్లలు పాల్గొన్నారని, ఈ సంవత్సరం మూడో బాలోత్సవంలో మరింత ఎక్కువ మంది పాల్గొంటారని భావిస్తున్నామన్నారు. ఈసారి విశాఖ వ్యాలీ రోటరీతో కలిసి నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం బాలోత్సవం ఆహ్వాన సంఘం సభ్యుల పేర్లను ఆయన ప్రతిపాదనకు పెట్టారు. ఆహ్వాన సంఘం గెస్ట్ ఆఫ్ హానర్‌గా ఉండడానికి విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్, జివిఎంసి కమిషనర్ కేతన్ గార్గ్, డిఇఒ ఎన్.ప్రేమ కుమార్ అంగీకరించారని తెలిపారు.

ఆహ్వాన సంఘం

ఆహ్వాన సంఘం గౌరవాధ్యక్షులుగా విశాఖ వ్యాలీ రోటరీ ట్రస్ట్ చైర్మన్ ఎం.జానకిరామ్, అధ్యక్షులుగా పి.రఘు, ప్రధాన కార్యదర్శిగా జిఎస్.రాజేశ్వరరావు ఎన్నికయ్యారు.

ఇటు భానుడు.. అటు వరుణుడు.. నడుమ హిమపాతం





మండలంలో మంగళవారం ఉదయం మంచు కురిసింది. అనంతరం ఎండ కాసింది. సాయంత్రం వర్షం కురిసింది. ప్రకృతి ప్రేమికులు ఈ ప్రకృతి అందాలను సెల్ఫీలు దిగుతూ ఆస్వాదించారు.

- ప్రజాశక్తి-అనంతగిరి